గ్రామాల్లో దొంగల భయం



పొన్నారిలో సీసీ కెమెరాలో కనిపించిన దొంగలు (ఫైల్)

- కొద్ది రోజులుగా వరుస దొంగతనాలు
- భయాందోళనలో ప్రజలు

తాంసి: మండలంలో దొంగలు సంచరిస్తూ.. ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. ఆయా గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడుతూ.. అందినకాడికి దోచుకెళ్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్ల వద్ద రెక్కి నిర్వహించి చోరీ చేస్తున్నారు. పంటచేలలో సైతం మోటార్లు, సోలార్ బ్యాటరీలను, రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన బైక్‌లను ఎత్తుకెళ్తున్నారు. వరుస దొంగతనాలతో ప్రజలు బెంబలెత్తిపోతున్నారు.

పొన్నారిలో హల్‌చల్..

మండలంలోని పొన్నారి గ్రామంలో ఆరు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో దొంగలు మాస్కులు ధరించి చోరీకి పాల్పడ్డారు. గ్రామంలో గుంపులు గుంపులుగా తిరుగుతూ.. దొంగతనాలు చేస్తున్నారు. మరొక వ్యక్తి ఇంటిలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన కుటుంబసభ్యులు చప్పుడు చేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. పలు గ్రామాల్లో దొంగల కదలికలు సీసీకెమెరాల్లో రికార్డు అయ్యాయి. గ్రామాలకు దూరంగా ఉన్న చేలలో విద్యుత్ మోటార్లు, సోలార్ బ్యాటరీలను ఎత్తుకెళ్తున్నారు. వద్దాడి గ్రామానికి చెందిన రైతు బెండే గంగాధర్ అంతరాష్ట్ర రోడ్డు పక్కన బైక్‌ను పార్కింగ్ చేయగా.. ఎత్తుకెళ్లారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రాత్రి సమయంలో గస్తీ పెంచి, దొంగలను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బైక్ ఎత్తుకెళ్లారు



గ్రామ శివారులోని అంతరాష్ట్ర రోడ్డు పక్కన పంట చేను ఉంది. రోడ్డు పక్కన బైక్‌ను ఉంచి చేలలోకి వెళ్లి వచ్చాను. వచ్చి చూసే సరికి బైక్‌ను ఎత్తుకెళ్లిపోయారు. చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. బైక్‌ను ఎత్తుకెళ్లడంతో రూ.60వేల వరకు నష్టపోయాను.

– బెండే గంగాధర్, వద్దాడి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం దొంగతనాలు జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే 100 డయల్ చేయాలి. రాత్రి సమయంలో సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారు. మావల ఇతర ప్రదేశాల్లో దొంగతనాలకు పాల్పడిన ముఠాగా గుర్తించాం.

– జీవన్ రెడ్డి, ఎస్సై, తాంసి

పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న ఏజెన్సీ అదనపు వైద్యాధికారి

ఇంద్రవెల్లి: ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి కుడ్మేత మనోహర్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని హోలీ ట్రినిటి ఆసుపత్రిని తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు, ఏఎన్‌ఎంల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. అనంతరం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని ఉమేష్ క్లినిక్‌ని తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీ అందిస్తున్న వైద్యంపై ఆరా తీశారు. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. ప్రజలు అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలన్నారు. అత్యవసర సమయంలో 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఈవో నాందేవ్, సిబ్బంది సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి



బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

సాత్నాల: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ప్రముఖ సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. భోరజ్ మండలం గూడా జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు చేయూత కార్యక్రమంలో భాగంగా ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించిన సుశాంత్, వైష్ణవితో పాటు గత ఏడాది ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గజేందర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మానవ హక్కుల చైర్మన్ బద్దం పురుషోత్తం రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని కుమురం భీం కాలనీలో గల పాఠశాలలో వరాహి హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో శిరీష్, ప్రవీణ ప్రసాద్, మహేశ్, మనోజ్, గణేష్, ఇందిర, రేణుక, వరుణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



మాట్లాడుతున్న ఏటీడీవో అమిత్ చౌహాన్

ఇచ్చోడ: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఏటీడీవో అమిత్ చౌహాన్ అన్నారు. సోమవారం మండలంలోని మేడిగూడ ఆశ్రమ పాఠశాలలో బోథ్ డివిజన్ ఆశ్రమ పాఠశాల పీజీహెచ్‌ంలు, హెచ్‌ఎంలు, వార్డెన్‌లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి హాజరు శాతం పెంచేలా ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలను శుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో పీజీ హెచ్‌ఎంలు స్వర్ణలత, గోడం చందన్, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న బ్రహ్మానంద్, బీజేపీ నాయకులు



జైనథ్: ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు



సాత్నాలలో..

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద కేక్‌కట్ చేశారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారుగా 550 మందికి పైగా రక్తదానం చేశారు. బ్రహ్మానంద్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ గణేష్ బోసారే, నాయకులు ఆదిత్య ఖండేశ్కర్, బోయర్ విజయ్, లోక కరుణాకర్ రెడ్డి, అస్తక్ సుభాష్, పోతరాజు రమేశ్, రాథోడ్ రోహిదాస్, పంద్ర రాము, దొడ అశోక్, కుంచాల రమేశ్, ఉగ్గి వసంత్, ఏనుగు రాకేశ్‌రెడ్డి, ఎల్టి అశోక్ రెడ్డి, గాజుల ప్రద్యుమ్న, బండి గజానంద్, ప్రకాష్ యాదవ్, రాకేశ్, రమేశ్‌రెడ్డి, సూర్యరెడ్డి, దివ్య, విశాల్, పోచన్న, సంతోష్, అశోక్, బింగి వెంకన్న, తోట రమేశ్, నీలం శ్రీకాంత్, శంకర్ పాల్గొన్నారు.

సాత్నాల: మండల కేంద్రంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి నాయకులకు పంచిపెట్టారు. బీజేపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు అస్తక్ సుభాష్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పోతురాజు రమేశ్, రాథోడ్ రోహిదాస్, దోడ అశోక్, రాము, సురేశ్, తారు, వసంత్, స్వామి పాల్గొన్నారు.

జైనథ్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే పాయలశంకర్ జన్మదిన సందర్భంగా బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సుఖశాంతులతో ఉండి, ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు రాకేశ్‌రెడ్డి, ప్రతాప్ యాదవ్, సామా రమేశ్‌రెడ్డి, బండి రవియాదవ్, ఉశన్న పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



తిరుమలలో కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన పుట్టిన రోజును పురస్కరించుకొని కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు వెల్లడించారు.

మహిళలందరికీ పెన్షన్ అందించాలి



మాట్లాడుతున్న ఫర్వీన్ ఫెరోజ్

ఆదిలాబాద్: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ మహిళకు రూ. 2500 పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకురాలు ఫర్వీన్ ఫెరోజ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ప్రతీ ఇంట్లో మహిళలకు రూ. 2500 పెన్షన్ ఇస్తానని కాంగ్రెస్ మోసపూరిత హామీ ఇచ్చిందని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలన్నారు. ఎన్నికల ముందు మహిళల ఓట్ల కోసం మభ్యపెట్టారని విమర్శించారు. తక్షణమే పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి ‘చలో ఆదిలాబాద్’



ఆదిలాబాద్ వెళ్తున్న నాయకులు

బోథ్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రతినిధి షేక్ మహబూబ్ మాట్లాడుతూ.. దివ్యాంగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పింఛన్‌ను రూ. 4,000 నుంచి రూ. 6,000కి పెంచాలని, పూర్తి స్థాయిలో ఉచిత బస్సుపాస్‌లు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోతే రాజేశ్వర్, భోగ శంకర్, రమేశ్, ఆసిఫ్, మాల్వే రామచందర్, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఇచ్చోడ: ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు,. సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో మాట్లాడారు. గూడెలలో ఆదివాసీ జెండాలు ఆవిష్కరించి, ర్యాలీలు, సభ నిర్వహించాలన్నారు. ఇచ్చోడలో నిర్వహించే కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు. సమావేశంలో రాయిసెంటర్ సార్‌మేడి మెస్రం శంభు, తుడందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్, ఆత్రం మహేందర్, పటేల్ భీంరావు, మెస్రం దేవురావు, సంగేపు రమేశ్, అడ భీంరావు పాల్గొన్నారు.

పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుంది



ఉద్యోగులను సన్మానిస్తున్న మేనేజర్ సందీప్

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుందని ఉట్నూర్ జీసీసీ డివిజన్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్ అన్నారు. గిరిజన సహకార సంస్థ పరిధిలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు ప్రభుత్వం సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించిన నేపథ్యంలో ఉట్నూర్ డివిజన్‌లో పదోన్నతి పొందిన 10 మంది ఉద్యోగులను ఉట్నూర్ కార్యాలయంలో సోమవారం సన్మానించారు. పదోన్నతి పొందిన ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజాసేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇస్తారి, మనోహర్, రమేశ్, గోవిందరావు, సదాశివ్, గణేష్, చందు, రూప్లా, లక్ష్మణ్, జంగు, డివిజన్ కార్యాలయ సిబ్బంది లింబారావు, సత్యనారాయణ, సంతోష్, సునీల్ పాల్గొన్నారు.

పరామర్శ

ఇచ్చోడ: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం నారాయణ్‌రెడ్డిని సోమవారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం నారాయణ్ రెడ్డి కాలు విరగడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎస్టీసెల్ రాష్ట్ర కన్వీనర్ జాదవ్ సునీల్, ముస్తాఫా, కరుణాకర్, ప్రవీణ్‌రెడ్డి, మజీద్ ఖాన్ ఉన్నారు.

కైలాస్‌నగర్: బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు సోదరుడు రాథోడ్ నర్సింగ్ నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసానికి వెళ్లి బాపూరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఆలయంలో భక్తుల రద్దీ



పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్చోడ: జిల్లాలో అతిపురాతన సిరిచెల్మ మల్లన్న ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. రెండో శ్రావణ సోమవారం కావడంతో భారీగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీలో సోమవారం రాత్రి డాగ్ స్క్వాడ్‌తో ప్రతీ దుకాణంలో సీఐ కర్రె స్వామి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఏదైనా షాపులో గంజాయి, ఇతర నిషేధిత వస్తువులను విక్రయిస్తున్నారనే అనుమానంతో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం



అర్జీలు స్వీకరిస్తున్న ఏవో దామోదర్‌స్వామి

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయమని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఏవో దామోదర్ స్వామి అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూరు మండలం మార్కగూడ గ్రామానికి చెందిన కనక భగవంతు వ్యవసాయ సాగు కోసం సోలార్ మంజూరు చేయాలని, సాత్నాల మండలం పాలయి తండా గ్రామానికి చెందిన సోము తనకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా ఇప్పించాలని, అలాగే పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీవో (పీవీటీజీ) మెస్రం మనోహర్, పీహెచ్‌వో సందీప్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన క్రీడాకారులు హన్మకొండ వేదికగా జరుగుతున్న 11వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. సోమవారం జరిగిన చివరి రోజు పోటీల్లో హ్యామర్ త్రో ఈవెంట్లో ఉమెన్స్ కేటగిరీలో తూము సౌమ్య రజత పతకంతో సత్తా చాటింది. అదే విధంగా హ్యామర్ త్రో ఈవెంట్లోనే మెన్స్ కేటగిరీలో రాథోడ్ వంశీ కాంస్య పతకం, 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్ ఈవెంట్లో విష్ణువర్ధన్ కాంస్య పతకంతో మెరిసినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, అసోసియేషన్ కోశాధికారి రాకేశ్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవడంపై అసోసియేషన్ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై పీర్ సింగ్‌నాయక్

భీంపూర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పీర్‌సింగ్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు పంపిన సమాచారం, ఫోన్ సంభాషణలో వ్యక్తిగత విషయాలను వెల్లడించకూడదన్నారు. పరిసరాలు, వ్యవసాయ పొలాల్లో గంజాయి పండించడం నిషేధమన్నారు. గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న గజేందర్

కైలాస్‌నగర్: నీతి ఆయోగ్ నార్నూర్ బ్లాక్ రాష్ట్రస్థాయి సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్‌లో భాగంగా గవర్నర్ చేతుల మీదుగా స్వర్ణ పతకాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కాంగ్రెస్ నాయకులు సోమవారం సన్మానించారు. బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆడె గజేందర్ ఆధ్వర్యంలో తన క్యాంపు కార్యాలయంలో కలిసి సత్కరించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ ఉన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

తాంసి: కళాశాలలో, పాఠశాలలో అమ్మాయిలను ర్యాగింగ్ చేస్తే చర్యలు తప్పవని షీ టీం ఏఎస్సై సుశీల హెచ్చరించారు,. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహన కల్పించారు. షీ టీం ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్, షీ టీం సభ్యులు వాణిశ్రీ, మహేశ్, మోహన్, రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ గర్జనకు తరలిన కాంగ్రెస్ నాయకులు



ఢిల్లీ వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న బీసీ గర్జన సభకు బోథ్, సొనాల మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు సోమవారం తరలివెళ్లారు. 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థలు కల్పించాలని డిమాండ్‌తో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగే మహాధర్నాకు తరలివెళ్లారు. కాగా బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ జెండా ఊపి వారిని ఢిల్లీకి పంపించారు. కార్యక్రమంలో నాయకులు గాజుల పోతన్న, బత్తుల రమేశ్, వినోద్, పోతన్న, భోజన పాల్గొన్నారు.

శివుడికి పంచామృత అభిషేకం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో సోమవారం శివుడి విగ్రహానికి పంచామృత అభిషేకం నిర్వహించారు. శ్రావణ సోమవారం కావడంతో గ్రామస్తులు శివుని విగ్రహానికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఏటా శ్రావణ సోమవారం సందర్భంగా అభిషేకం చేయడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్, మాజీ ఎంపీటీసీ శివకుమార్ రెడ్డి, సామాజిక కార్యకర్తలు రాథోడ్ మౌనిక, ముక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కండువా కప్పుతున్న ఆడే గజేందర్

తాంసి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు ఆశన్న కాంగ్రెస్‌లో చేరారు. గ్రంథాలయ చైర్మన్ నర్సయ్యతో కలిసి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గణేశ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కౌడాల సంతోశ్, వన్నెల నరేశ్, రామన్న యాదవ్, చిన్న రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఆడే గజేందర్

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన చాంబర్‌లో శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజుయాదవ్ ఉన్నారు. నేరడిగొండ మండలంలోని సుర్దాపూర్ గ్రామంలో మథుర సమాజ్ నాయక్ బాసస్ దాస్ ఇంటి వద్ద జరిగిన గురు సాహెబ్ కార్యక్రమంలో సోమవారం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. ఆయన వెంట బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ త్రిత్రే నారాయణ్ సింగ్, సీనియర్ నాయకులు సాబ్లే కైలాష్, సాబ్లే అందు సింగ్, కిషన్ సింగ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, ఎండీ సద్దాం, మౌలాన, బద్దం పోతరెడ్డి పాల్గొన్నారు.